ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
మంగళవారం, 18 జూన్ 2024





కాన్పు కోసం వస్తే.. కాదు పొమ్మన్నారు

- కొత్తగూడెం మాతాశిశు సంరక్షణ కేంద్రం నిర్వాకం
- పురిటి నొప్పులతోనే బాధితురాలు 180 కి.మీ. ప్రయాణం
- చివరకు 108 అంబులెన్సులో సుఖ ప్రసవం

గుండాల, జూన్ 17: ఆమె నిండు గర్భిణి, నిరుపేద, మారుమూల పల్లెటూరు నుంచి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ప్రసవ వేదనతో కాన్పు కోసం కొత్తగూడెం ఆసుపత్రికి వస్తే అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు ఇప్పుడే కాన్పు కాదు పొమ్మన్నారు. రాత్రి వేళ బస్సులో ఇంటికి చేరుకోగానే నొప్పులు ఎక్కువ కావడంతో 108లో గుండాల పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవం అయ్యింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి జిల్లా గుండాల మండల కేంద్రానికి 15కి.మీ.ల దూరంలోని నాగారం గ్రామానికి చెందిన కల్తి నవ్యకు శనివారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో ఇంటి వద్దనే తెల్లవారేవరకు ఉండి ఆదివారం ఉదయం గుండాల పీహెచ్‌సీకి ద్విచక్రవాహనంపై తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఆమెకు ఇంకా నెలలు నిండలేదని, కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రామవరం మాతాశిశు కేంద్రానికి వెళ్లాలని రిఫర్ చేశారు. దాంతో ఆమెను అక్కడి తీసుకెళ్లగా పరీక్షించి పర్యవేక్షణలో ఉంచాల్సిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఒక ఇంజక్షన్ వేసి కాన్పు కావడానికి మరి కొంతకాలం పడుతుందని చెప్పి ఇంటికి వెళ్లమన్నారు. అయితే నవ్య ఆ నొప్పులతోనే ఆర్టీసీ బస్సులో 100కి.మీ. ప్రయాణించి ఇంటికి చేరుకుంది. కానీ అదేరోజు రాత్రి నొప్పులు ఎక్కువ అవడంతో 108లో నాగారం నుంచి గుండాల తీసుకెళుతుండగా నొప్పులు ఎక్కువై 108 లోనే సుఖప్రసవం జరిగింది. ఆమెకు ఆడ బిడ్డ జన్మించింది. కాగా సాధారణ ప్రసవానికి సైతం రామవరం మాతా శిశు కేంద్రం వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధిత కుటుంబసభ్యులు వాపోయారు. పురిటినొప్పులు పడుతున్న భార్యతో 24గంటలుపాటు 180కి.మీల ప్రయాణం చేసినా సరైన వైద్యం అందక పోవడంతో నవ్య భర్త సురేష్ కన్నీరు మున్నీరుగా విలపించాడు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

- ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు
- పాల్గొన్న పలువురు ప్రముఖులు



అశ్వారావుపేటలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కొత్తగూడెం సాంస్కృతికం, జూన్ 17: జిల్లాలోని వివిధ మండల కేంద్రాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం కబరస్తాన్‌లో పెద్దలకు ప్రార్థనలు చేశారు. కొత్తగూడెం ఈద్గాలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి యెర్రా కామేష్‌తోపాటు వివిధ రాజకీయ పార్టీలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ ఆలింగనం చేసుకున్నారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌కు తొర్రూరు మండలానికి చెందిన పలువురు రైతులు కొత్తగూడెం వచ్చి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. తమ సామరస్యాన్ని కాపాడేవిధంగా ముస్లిం సోదరులు స్నేహితులను విందులకు ఆహ్వానించి బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా జిల్లాలోని పాల్వంచ, ఇల్లెందు, చంద్రుగొండ, జూలూరుపాడు, భద్రాచలం, అశ్వారావుపేట, మణుగూరు ప్రాంతాలో బక్రీదు వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఇందిరాకాలనీ వద్ద ఈద్గాలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండం వెంకన్న, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, మైనార్టీ నాయకులు ఎస్‌కే. చాంద్‌పాషా, ఎస్‌కే. దస్తగిరి, ఎస్‌కే. పాషా, వెంకటేశ్వర్లు, కాపర్తి వెంకటాచారి, పాల్గొన్నారు.

పినపాక ఎమ్మెల్యేకు
మాతృవియోగం
ఫోన్ ద్వారా మంత్రుల పరామర్శ 6

రామయ్య గోత్ర ప్రవరలపై
అభిప్రాయ సేకరణ
నేడు భద్రాచలానికి విచారణ కమిటీ? 7

రెగ్యులర్ ఎంఈవోలు
నలుగురే..
మిగిలిన 19 మండలాలకు ఇన్‌చార్జిలే గతి
భద్రాద్రి జిల్లాలో విద్యారంగం దుస్థితి 7

శిశువులకు
శ్రీరామరక్ష 7
ప్రత్యేకత చాటుతున్న భద్రాద్రి నవజాత శిశు చికిత్స కేంద్రం

తాగునీరు, పారిశుధ్యంపై
ప్రత్యేక దృష్టి



- పక్షం రోజులకోసారి ట్యాంకుల క్లోరినేషన్
- మురుగు నీరు నిల్వ ఉండకుండా డ్రెయిన్ల క్లీనింగ్
- పన్నుల వసూళ్లకు పకడ్బందీ చర్యలు
- ఇప్పటి వరకు రూ.12 కోట్ల 10 లక్షల వసూలు

జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 17: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తాగునీరు , పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఈ.హరికిషన్ స్పష్టం చేశారు. ప్రజలు పన్నులు చెల్లించి ఆయా గ్రామపంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 584 పంచాయతీల్లో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంచాయతీలలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తాగునీరు సరఫరా, పారిశుధ్యం నిర్వహణ, పన్నుల వసూళ్లు, వ్యాధుల నివారణకు కార్యాచరణ తదితర అంశాలపై సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....

57శాతం పన్నుల వసూలు

ఈ ఏడాది ఇప్పటి వరకు పన్నుల రూపంలో రూ. 12కోట్ల 10 లక్షలు వసూళ్లయ్యాయి. ఇంకా రూ. 8 కోట్ల 80 లక్షలు వసూలు కావాల్సి ఉంది. 57శాతం పన్నులు వసూలయ్యాయి. అయితే ప్రజలు పన్నులు చెల్లిస్తే పంచాయతీల్లో అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం జనరల్ ఫండ్ నిధులతోనే నెట్టుకొస్తున్నాం.జిల్లాలో 589 పంచాయతీల్లో గత ఏడాది నుంచి అరకొరగా టీఎఫ్‌సీ, ఎస్ఎఫ్‌సీ నిధులు వస్తున్నమాట వాస్తవమే. ఫలితంగా కొన్ని గ్రామపంచాయతీల్లో ఇబ్బందులు కలుగుతున్నాయి. పన్నుల వసూళ్లు జరిగితే అభివృద్ధికి ఆస్కారం ఉండేది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిధులు లేమి కొంత ఇబ్బందులు కలుగుతున్నాయి. కోడ్ ముగిసిన నేపథ్యంలో నిధులొస్తాయని భావిస్తున్నాం. పంచాయతీల్లో ఎంపీడబ్ల్యూఎస్ వర్కర్లకు వేతనాలు విషయంలోనూ అన్ని చర్యలు చేపడుతున్నాం. గత మూడు నెలల బకాయిలు మాత్రమే ఉన్నాయి. వాటిని కూడా చెల్లిస్తాం. చిన్న పంచాయతీల్లోనే మరిన్ని ఇబ్బందులు ఉన్నాయి.


తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి

వర్షాకాలంకు ముందే గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే మిషన్‌భగీరథ ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం. ఇప్పటికే 1లక్ష 22,965 ఇళ్లను సర్వే చేశాం. మరో నాలుగైదు రోజుల్లు ఈ సర్వే పూర్తి చేసి ఇంటింటికీ సురక్షితమైన తాగునీటిని అందించాలన్నది లక్ష్యం. క్లోరినేషన్ చేయడం.చేపడుతున్నాం. పారిశుధ్యానికి మరింత ప్రాధాన్యతను ఇవ్వనున్నాం. డ్రెయిన్లు శుభ్రం చేసి మురుగునీరు నిల్వ ఉండకుండా అన్ని గ్రామపంచాయతీల్లోనూ చర్యలు చేపట్టాం. వర్షాలకు ముందుగానే అన్ని చర్యలు చేపడుతున్నాం. పారిశుధ్యం లోపించకుండా డ్రెయిన్లు శుభ్రపరిచి మురుగునీరు సక్రమంగా పారేలా చర్యలు చేపట్టనున్నాం. ప్రజలకు మురుగునీటి నిల్వ వలన నష్టాలపై అవగాహన కల్పించనున్నాం. ప్రతి పక్షం రోజులకోమారు ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని నిర్ణయించాం. దోమలు పుట్టకుండా ముందస్తుగానే అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చాం. చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో పెండకుప్పలు, చెత్తకుప్పలు లేకుండా అన్ని గ్రామ పంచాయతీల్లోనూ సిబ్బందికి ప్రజల అవగాహన కల్పించేలా చేయాలని సూచించాం.

ట్రాక్టర్లతో ప్రయోజనం

589 గ్రామపంచాయతీల్లోనూ ట్రాక్టర్ల నిర్వహణ సక్రమంగానే ఉంది. వీటితో గ్రామాల్లో బహుళ ప్రయోజనాలు ఒనగూరుతున్నాయి. అయితే 58 గ్రామపంచాయతీల్లో ట్రాక్టర్లకు ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితులున్నాయి. 500 జనాభా లోపు ఉన్న పంచాయతీలు కావడం వలన ఇక్కడ పంచాయతీలకు ఇతరత్రా ఆదాయం లేని కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటిని అధిగమించేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. ఇక ట్రాక్టర్ల నిర్వహణ, పనితీరు మెరుగ్గా ఉంది. గ్రామ పంచాయతీల్లోనూ వెంచర్ల నిర్వహణ, భవననిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నాం. ఎక్కడైనా నిబంధనలను అతిక్రమిస్తే ఉలాంటి వారినైనా ఉపేక్షించేది లేదు. ఇలాంటి వ్యవహారాలకు సహకరించిన సిబ్బందిపై కూడా శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

కొత్తగా వచ్చిన జిల్లా పాలనాధికారులకు అనేక సవాళ్లు, సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. రాష్ట్ర వ్యాప్త ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకు నూతన కలెక్టర్లు నియామకమైన విషయం విదితమే. ఖమ్మం కలెక్టర్‌గా ముజమ్మిల్‌ఖాన్, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా జితేష్ వి.పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. ముగ్గురు అమాత్యులు కొలువుదీరిన ఇరు జిల్లాల్లో కలెక్టర్ల విధి నిర్వహణ కత్తిమీద సాముగానే ఉంటుంది. ఒకవైపు అభివృద్ధిని, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తూనే, మరోవైపు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సి వుంది. ప్రధానంగా సీతారామ ప్రాజెక్టు పూర్తికి ఇరు జిల్లాల కలెక్టర్లు సమన్వయంగా ముందుకు సాగాల్సి వుంది. అలాగే జాతీయ రహదారులకు భూ సేకరణ, రుణమాఫీ అమలు, విద్యారంగంపై పర్యవేక్షణ, ధరణి సమస్యల పరిష్కారం కీలకంగా మారనున్నాయి. యువ అధికారులుగా పాలన పగ్గాలు చేపట్టిన కలెక్టర్లు.. తమదైన మార్కు చూపాలని భిన్న వర్గాల వారు కోరుతున్నారు.



తమదైన మార్కు చూపుతారా!?

- కొత్త కలెక్టర్ల ముందు సమస్యల సవాళ్లు
- ప్రతిష్ఠాత్మక సీతారామ ప్రాజెక్టు పూర్తి ఎంతో కీలకం
- ఆగస్టు 15 నాటికి నీరివ్వాలని సర్కారు లక్ష్యం
- ఇంకా కొన్నిచోట్ల పూర్తికాని భూ సేకరణ
- జాతీయ రహదారుల భూసేకరణలోనూ అనేక సమస్యలు
- తలనొప్పిగా మారనున్న రుణమాఫీ లబ్ధిదారుల ఎంపిక
- ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల భూములకూ లేని హక్కుపత్రాలు
- పట్టు తప్పుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యారంగం
- సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలకు పరిష్కారం

ఖమ్మం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకంతోపాటు సీతమ్మసాగర్ డ్యామ్ నిర్మాణం విషయంలో కలెక్టర్లు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. కీలకమైన సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను ఇటీవల డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించి పలు సమస్యలను గుర్తించారు. సీతారామ ఎత్తిపోతల ద్వారా ఆగస్టు 15 నాటికి సాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇంకా చాలావరకు భూసేకరణ చేయాల్సి ఉంది. కొంత అటవీప్రాంతం ఉండడంతోపాటు టన్నెల్స్ కూడా నిర్మించాల్సి ఉంది. ఇద్దరు కలెక్టర్లు చొరవ తీసుకుని భూసేకరణ త్వరితగతిన పూర్తి చేస్తేనే ఆగస్టు 15నాటికి వైరా రిజర్వాయర్‌కు సీతారామ ద్వారా గోదావరి జలాలు అందే అవకాశం ఉంది. అలాగే పాలేరు లింక్ కెనాల్ పనులు ప్రారంభం కావాలంటే భూసేకరణ వెంటనే పూర్తి చేయాల్సి ఉంది. ఇక ఖమ్మంలో మున్నేరుకు రెండువైపులా రూ.690కోట్లతో 8.50కి.మీ. పొడవున వరద నివారణ గోడలు నిర్మిస్తున్నారు. దీనికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు కూడా ప్రారంభించారు. భూసేకరణ ఇంకా పూర్తి కాలేదు. మున్నేరు ఆనుకుని ఉన్న భూములు ముంపు ప్రాంతాలైనా వాటికి మార్కెట్ విలువ భారీగా ఉంది. దాంతో ఇక్కడ కూడా భూసేకరణ విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. అలాగే జిల్లాలో నాగపూర్-అమరావతి హైవేకు సంబంధించి ఖమ్మంరూరల్, రఘునాథపాలెం, చింతకాని మండలాల పరిధిలో భూసేకరణ సమస్య జటిలంగా ఉంది. సర్వే పూర్తయినా రైతులు భూములు ఇచ్చేందుకు సుముఖంగా లేరు. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు అధికంగా ఉండడంతో ప్రభుత్వం ఇచ్చే ధరకు భూములు ఇచ్చేందుకు ఆయా రైతులు విముఖత చూపుతున్నారు. భద్రాద్రి జిల్లాలో అక్కడి కలెక్టర్ గిరిజనుల అభివృద్ధి, పోడుభూములకు సాగునీటి కల్పన (మిగతా 6వ పేజీలో)

కొనసాగుతున్న టీచర్ల
పదోన్నతుల ప్రక్రియ

స్కూల్ అసిస్టెంట్లుగా 890 మంది

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 17: జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. గత మూడు రోజులుగా వినతుల ప్రక్రియకు ఆన్‌లైన్లో సైట్ ఓపెన్ కాకపోవటంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం రాత్రి ఆన్‌లైన్ సైట్ ఓపెన్ అయి వినతుల ప్రక్రియ ముగియటంతో వెంటనే ఎడిట్ ఆప్షన్ ప్రక్రియను వినియోగించుకున్నారు. ఈ ప్రక్రియ ఆదివారం రాత్రి వరకు కొనసాగింది. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందే వారి జాబితా సోమవారం రాత్రి కల్లా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. జిల్లాలో మొత్తం 890 మంది టీచర్లకు పదోన్నతులు రానున్నట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి 22 వరకు ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

రామాలయంలో సుదర్శన హోమం

- నిత్య కల్యాణంలో పాల్గొన్న 107 జంటలు
- స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు



రామాలయంలో కర్ణాటక రాష్ట్ర ఎన్నికల కమిషనర్ బస్వరాజు

భద్రాచలం, జూన్ 17: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం చిత్తానక్షత్రాన్ని పురస్కరించుకొని సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలకు ముందుగా సుదర్శనమూర్తిని ఆలయం నుంచి మేళతాళాలతో తీసుకొచ్చారు. అనంతరం పూజాకార్యక్రమాలు నిర్వహించారు. చివరిగా సుదర్శన మంత్ర హోమం నిర్వహించారు. సుదర్శనమూర్తికి ప్రత్యేక ప్రసాదాలను నివేదన చేసి ఉభయ దాతలకు అందజేశారు. చివరగా పూర్ణాహుతి చేశారు. సోమవారం స్వామివారికి నిర్వహించిన నిత్యకల్యాణంలో 107 జంటలు పాల్గొన్నాయి. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్యను రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్ పబ్లిక్ రిలేషన్స్ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, కర్ణాటక ఎన్నికల కమిషనర్ బి.బసవరాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయబద్దంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. వీరితో పాటు స్వామివారిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆదాయపన్నుశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత దర్శించుకున్నారు.

గొడవలు భరించలేక
గొంతు నులిమాడు..

- రెండో భార్యను హత్య చేసిన భర్త
- గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం
- కుటుంబ సభ్యులు నిలదీయటంతో నిజం వెల్లడి



కళావతి మృతదేహం

ఖమ్మం క్రైం,జూన్ 17:టవల్‌తో భార్య గొంతు నులిమి భర్త హత్యచేసిన సంఘటన సోమవారం తెల్లవారుజామున ఖమ్మం నగరంలో జరిగింది. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నేలకొండపల్లి మండలం భైరవునిపల్లికి చెందిన బుర్ర మల్లయ్యకు మొదట శైలజతో వివాహమైంది. కొద్దిరోజుల తరువాత శైలజ కనిపించకుండా పోవటంతో 2011లో స్వగ్రామానికి చెందిన కళావతి(32)ని రెండోపెళ్లి చేసుకున్నాడు. మల్లయ్య, కళావతితో కలిసి ఖమ్మం నగరంలోని వికలాంగుల కాలనీలో నివాసం ఉంటూ ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు.మొదటి భార్య శైలజ తిరిగి రావటంతో తనకు విడాకులు ఇవ్వలేదని స్థానిక పెద్దలతో పంచాయతీ పెట్టింది. దీంతో ఇద్దరితో కలిసి ఉండేందుకు పెద్దమనుషుల సమక్షంలో మల్లయ్య అంగీకరించాడు. దీంతో నగరంలోని వికలాంగుల కాలనీలో ఒకే ఇంట్లో రెండు పోర్షన్లలో ఇరువురిని ఉంచి అక్కడే నివాసం ఉంటున్నాడు. గత కొద్దినెలలుగా ఇద్దరు భార్యల మధ్య గొడవలు జరుగుతుండటంతో గత రెండురోజుల క్రితం మొదటి భార్య శైలజను పుట్టింటికి పంపించాడు. అదేవిధంగా కళావతికి ఉన్న 12ఏళ్ల కుమార్తెను అమ్మమ్మ గారి ఇంటికి పంపించాడు. ఇంట్లో మల్లయ్య, కళావతి మాత్రమే ఉన్నారు.సోమవారం తెల్లవారుజామున టవల్‌తో కళావతి గొంతు నులిమి హత్య చేశాడు. తరువాత బంధువులకు ఫోన్‌చేసి గుండెపోటుతో కళావతి మృతి చెందిందని మల్లయ్య చెప్పాడు. కళావతిని మెడపై నల్లగా కనిపించడతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు మల్లయ్యను నిలదీయటంతో టవల్‌తో తానే గొంతునులిమి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. కళావతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు రంగప్రవేశం చేసి మల్లయ్యపై కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు.



ఒలింపిక్ డే జెర్సీని ఆవిష్కరిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ఒలింపిక్ డే రన్ విజయవంతం చేయాలి

జెర్సీలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 17: క్రీడాస్ఫూర్తిని చాటుతూ ఈ నెల 23వ తేదీన అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. సోమవారం కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఒలింపిక్ డే జెర్సీలను ఆవిష్కరించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల వైపు దృష్టి సారించి పతకాలు సాధించాలని పిలుపునిచ్చారు. దేశానికి ప్రాతినిధ్యం వహించేది కేవలం క్రీడలతోనే అని గుర్తు చేశారు. అలాంటి క్రీడాకారులను, వారి ప్రతిభను గుర్తించి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రణాళికబద్ధంగా చిన్నతనం నుంచే తమకు ఇష్టమున్న క్రీడలను ఎంచుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించి కొత్తగూడెం ఖ్యాతిని ఇరుమడింప చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 20న దమ్మపేటలో, 21న భద్రాచలంలో, 22న మణుగూరు మీదుగా కొత్తగూడేనికి ఈ ఒలింపిక్ డే రన్ చేరుకుంటుందని ప్రతీఒక్కరు ఈ రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడా అసోసియేషన్ సభ్యులు కె.మహిధర్, ఊపేష్, జాన్సన్ సుధాకర్, ఇల్లుటూరి ప్రవీణ్, బి.నాగేందర్, అక్బర్, ఇందు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టేకు కలప అక్రమ రవాణా

- ఫారెస్టు అధికారుల హస్తంతోనే..
- అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా తరలింపు

ఇల్లెందురూరల్, జూన్ 17:ఇల్లెందు-గుండాల సరిహద్దు గ్రామాల నుంచి కొందరు ఫారెస్టు అధికారులు అక్రమంగా సాగిస్తున్న టేకుకలప అక్రమ రవాణా గుట్టురట్టయింది. గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్న ఈ అక్రమ రవాణా పర్వంలో కొందరు ఫారెస్టు అధికారులతో పాటు, పోలీసులు, మీడియా ప్రతినిధులు ఉండడం గమనార్హం. గుండాల మండలం కాచినపల్లి రేంజ్ పరిధిలోని పెద్దతోగు ఫారెస్టు బీట్ పరిధిలోని కొందరు ఫారెస్టు అధికారులు అర్ధరాత్రి ట్రాక్టర్‌లో కలపను తరలిస్తుండగా ఫారెస్టు తోటి అధికారులకే పట్టుబడడంతో తీవ్రచర్చనీయమైంది. పెద్దతోగు బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నిర్మల తనపై అధికారులకు తెలియకుండా పెద్దతోగు బీట్‌లో ఉన్న ఓ గిరిజన రైతు చేనులో ఉన్న టేకు కలపను గుండాల మండలంలో పనిచేస్తున్న కొందరు పోలీసు అధికారులతో కలిసి కొనుగోలు చేసింది. ఆ కలపను ఇల్లెందుకు తరలించేందుకు పథకం ప్రకారం సదరు పోలీసులతో కలిసి నెంబర్‌లేని ట్రాక్టర్ ద్వారా ఇల్లెందుకు తరలించేందుకు వ్యూహం చేశారు. ఈక్రమంలో ఆదివారం, సోమవారం(బక్రీద్) రెండు రోజులు సెలవు ఉండడంతో పై అధికారులు అందరు సెలవులపై ఇంటికి వెళ్లారు. పథకం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి పెద్దతోగు నుంచి ఇల్లెందుకు కలపను తరలించే క్రమంలో కొంత మంది తోటి ఉద్యోగులను మచ్చిక చేసుకొని కలపను తరలిస్తుండగా కొమరారం ప్రాంత ఫారెస్టు ఉద్యోగులు వలపన్ని పట్టుకున్నారు. తను ఈ కలపను డీపోకు తరలిస్తున్ననని నమ్మబలికేందకు ప్రయత్నించారు. కలపను తరలించే క్రమంలో కలపకు సంబంధించిన పీఓఆర్, ఎన్ఓఎస్ పత్రాలు చూపించకపోవడంతో కొమరారం ఫారెస్టు అధికారులు ఇది అక్రమ కలప అని ఇల్లెందు డీపోకు తరలించారు. ఎలువంటి పత్రాలు చూపించకపోవడంతో ట్రాక్టర్లలో ఉన్న కలపను ఇల్లెందు కలప డిపోకు కొమరారం ఫారెస్టు అధికారులు తరలించారు.ఇదిఇలా ఉండగా పెద్దతోగు నుండి ఇల్లెందుకు కలపను తరలించే క్రమంలో కాచినపల్లి-అనంతోగు వేళ్లే రాహదారి వ్ద ఫారెస్టు చెక్ పోస్టు ఉద్యోగులు సైతం వదిలివేయడంతో ఈ అక్రమ రవాణా దందాలో ఎంత మంది పాత్ర ఉందో తెలియాల్సిఉంది. అంతేకాకుండా కలప తరలించే క్రమంలో కొందరు మీడియా ప్రతినిదులు అడ్డుకోవడంతో వారికి బీట్ అధికారి వారికి ముడుపులు అప్పగించడంతో వారు సైతం వదిలివేసినట్లు తెలిసింది.అక్రమ రవాణాపై పెద్దతోగు బీట్ ఆఫీసర్ నిర్మలను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాను ఎటువంటి అక్రమాలు చేయలేదని గాలికి కింద పడ్డ టేకు చెట్లను తాను డిపోకు తరలిస్తున్నట్లు తెలిపారు.



రవాణాకు సిద్ధంగా ఉన్న టేకు కలప

సమగ్ర విచారణ చేపడుతాం : ఇంచార్జీ రేంజర్ రేవంత్

పెద్దతోగు బీట్ పరిధిలో జరిగిన టేకు కలపపై సమగ్ర విచారణ చేపడుతా, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు, ఎటువంటి సమాచారం లేకుండా కలప రవాణా చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.



వ్యూ పాయింట్ ద్వారా గనిని పరిశీలిస్తున్న డైరెక్టర్ అండ్ పా శ్రీనివాస్

సమష్టి కృషితో లక్ష్యం సాధించాలి

సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్, పా శ్రీనివాస్

మణుగూరుటౌన్, జూన్ 17: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాకు యాజమాన్యం నిర్ధేశించిన లక్ష్యాలను సమష్టి కృషితో సాధించాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ (పా) ఎస్‌వీకే శ్రీనివాస్ అధికారులకు సూచించారు. సోమవారం మణుగూరు ఏరియాలో ఇన్‌చార్జ్ జీఎం, పీకేవోసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ లక్ష్మీపతిగౌడ్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఏరియాలోని గనులను సందర్శించి వ్యూ పాయింట్‌ల ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతలను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా బొగ్గు ఉత్పత్తి చేయాలని, ఇందుకు శ్రామిక శక్తితోపాటు యాంత్రికశక్తిని కూడా ఎక్కువగా వినియోగించాలన్నారు. లక్ష్యాల సాధనకు యాజమాన్యం అన్ని రకాల వనరులను ఎప్పటికప్పుడు సమకూర్చుతూనే ఉందని, నిర్ధేశిత లక్ష్యం 126.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, సరఫరా ప్రక్రియలో వర్షాకాలంలోనూ ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద నీరు పోయేందుకు రహదారులకు ఇరువైపుల కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యటనలో ఎస్వోటు జీఎం శ్యాంసుందర్, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ రాంబాబు, వీరభద్రుడు, పీకేఓసీ మేనేజర్ సురేష్, సర్వే అధికారి చిట్టా శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెవీవాటర్ ప్లాంట్‌ను సందర్శించిన బోర్డు చైర్మన్

అశ్వాపురం, జూన్ 17: మణుగూరు హెవీవాటర్ ప్లాంట్‌ను సోమవారం హెవీవాటర్ బోర్డు (ముంబాయి) చైర్మన్ సత్యకుమార్ సందర్శించారు. బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా మణుగూరుప్లాంట్ సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా 20వేల లీటర్ల భారజలాన్ని దక్షిణకొరియాకు ఎగుమతి చేసే ప్రక్రియను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్లాంట్ జీఎం జగ్గారావు, డీజీఎం శ్రీనివాసరావు, హెచ్‌కె.శర్మ,జగన్నాథశర్మ, ఏడీఎంవో రాఖీ పాల్గొన్నారు.

కేఎంసీలో పేరుకుపోతున్న ఫైళ్లు

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 17:ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో ఫైళ్లు పేరుకుపోతున్నాయి. ఫైళ్లను ఎప్పటికప్పుడు పరిష్కరించకపోవటంతో చిన్న పనులకు కూడా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సివస్తోంది. టీఎస్‌బీపాస్ ద్వారా నిర్మాణ అనుమతుల కోసం రెండోసారి ఫీజు చెల్లింపు, జనన, ధ్రువీకరణ పత్రాల ఆమోదం, ఇంటినెంబర్ల ధ్రువీకరణ తదితర పనులకు సంబంధించిన ఫైళ్లు భారీగా పెండింగ్‌లో పడ్డాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించినవే ఎక్కువ. దీంతో దరఖాస్తు చేసినవారు నెలల తరబడి నగరపాలకసంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

అసెంబ్లీ, లోక్‌సభ, ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో నగరపాలకసంస్థ అధికారులకు విధులు కేటాయించటం, నగరపాలకసంస్థ కమిషనర్ రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వహించటంతో ఫైళ్ల పరిష్కారానికి నోచుకోవటం లేదు. సెల్ఫ్ అసెస్‌మెంట్ ద్వారా ఇంటినెంబర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. దరఖాస్తు చేసి, ఆస్తిపన్ను చెల్లించిన వారు అధికారుల ఆమోదం కోసం తిరుగుతున్నారు. తమ దరఖాస్తును ఆమోదించారో, తిరస్కరించారో తెలియని పరిస్థితి ఏర్పడింది. దరఖాస్తులను వివిధ స్థాయిల్లోని అధికారులు ఆమోదించి, కమిషనర్‌కు పంపిస్తారు. కమిషనర్ ఆమోదానికి ఎక్కువసంఖ్యలో ఫైళ్లు ఉన్నాయి.

కమిషనర్ బదిలీ కావటంతో...

నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఉద్యోగోన్నతిపై వనపర్తి జిల్లా కలెక్టర్‌గా బదిలీ కావటంతో పెండింగ్ ఫైళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇళ్ల నిర్మాణాల అనుమతులకోసం రెండో దఫా ఫీజు ఖరారు, ఇంటినెంబర్లు ఆమోదం తదితర ఫైళ్లు కమిషనర్ లాగిన్‌లోనే ఉన్నాయి. ఆదర్శ్‌సురభి స్థానంలో వచ్చే కమిషనర్ సదరు ఫైళ్లను ఆమోదిస్తారా? తిరిగి విచారణ అంటూ కాలాయాపన చేస్తారా? అన్న ఆందోళన దరఖాస్తుదారుల్లో నెలకొంది.

మూగ రోదన..

- కబేళాలకు తరలుతున్న మూగజీవులు
- అక్రమార్కులకు అడ్డగా పండితాపురం సంత
- రూ.లక్షలు గడిస్తున్న వ్యవహరిస్తున్న అక్రమార్కులు
- చూసి చూడనట్లుగా అధికారులు

కామేపల్లి, జూన్ 17: ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురంలో శ్రీకృష్ణ ప్రసాద్ వారాంతపు పశువుల సంత రాష్ట్రంలోనే ప్రఖ్యాతిగాంచింది. ప్రతి బుధవారం జరిగే సంతకు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాను పశువుల, మేకలు, గొర్రెల క్రయ విక్రయాలు జరుగుతాయి. కొందరు అక్రమార్కులు ఇదే అదునుగా భావించి రైతుల వద్ద నుంచి తక్కువ దరకు ఆవులను కొనుగోలు చేసి కబేళాకు తరలిస్తున్నారు. సంత నుంచే కనీసం సుమారు 500 నుంచి 1000వరకు కబేళాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇంతలా యదేచ్ఛగా తరలిస్తున్న ఎక్కడ పట్టుకున్న దాఖలాలు లేవు. ఈ దందాలో రూ. కోట్ల చేతులు మారుతున్నాయి. ఇతర రాష్ట్రాల వ్యాపారుల కొనుగోలుకు చోట మోటా నాయకులు, ఏజెంట్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. కేరళకు చెందిన ఓ వ్యాపారీ ఇక్కడ కీలకంగా వ్యవహరిస్తూ ఆవులను భారీగా కొనుగోలు చేసి వాటిని లారీల్లో, కంటైనర్‌లలో కేరళకు తరలిస్తున్నాడు.



సంత నుంచే అక్రమ రవాణా

సాదారణంగా రైతు నుంచి దళారి ఒక ఆవును రూ.15వేల నుంచి రూ.25వేల వరకు కొనుగోలు చేస్తే దానిని స్థానికంగా ఉన్న ఏజెంట్ రూ.25 నుంచి రూ.35వేలకు అమ్ముతుండగా ... అదే ఏజెంట్ ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు రూ.5వేల నుంచి 10వేల లాభంతో అమ్ముతారు. వారు తెల్లవారుజామునే సగం వరకు ఆవులను కంటేనర్, లారీల్లో తరలిస్తున్నారు. ఇది అంతా పండితాపురం సంత నుంచే అక్రమ రవాణా జరగడం గమనార్హం. అంతే కాక ఖమ్మం నుంచి మరి కొందరు వ్యాపారులు ఆటో ట్రాలీలలో నాలుగైదు ఆవులను విడుతలు విడుతలుగా తరలిస్తున్న ఏ ఒక్క అధికారి పట్టుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఆవులను తరలిస్తున్న దృశ్యం

వాహనాల్లో కుక్కి తరలింపు

ఆవులను విచక్షణరహితంగా లారీల్లో కుక్కి తీసుకెళ్తున్నారు. అసలు ఒక కంటైనర్‌లో 24 పశువులను తీసుకెళ్లాల్సి ఉండగా కానీ అక్రమార్కులు 40 నుంచి 50 వరకు ఆవులను తీసుకెళ్తున్నారు. చిన్న లారీల్లో 8, పెద్ద లారీల్లో 12 వరకు తీసుకెళ్లాల్సి ఉండగా 20 నుంచి 30 వరకు ఆవులను కుక్కి మరీ తీసుకెళ్తున్నారు. గంటల తరబడి సాగే ఈ ప్రయాణంలో ఆ మూగ జీవాల వ్యథ చెప్పనలవికానిది. అక్కడికి వెళ్లే లోపే కొన్ని మృత్యువాత పడుతున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులే ఈ వ్యాపారులే కీలకంగా వ్యవహరిస్తుండగా వారికి దళారులు సహకిరిస్తున్నారు. ఈ దందాతో భవిష్యత్తులో వ్యవసాయం, ఇతర అవసరాలకు పశువులు దొరకని పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి ఆవులు తరలింపు ప్రక్రియను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు

● మధిర డివిజన్ ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయలక్ష్మి



ప్రణాళికా ప్రతిపాదనలను భట్టికి వివరిస్తున్న సిద్దార్ద్ విక్రంసింగ్

ఎర్రుపాలెం జూన్ 17: ఎర్రుపాలెం మండలంలో పర్యాటక అభివృద్ధికి జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్ద్‌విక్రమ్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రణాళికలను డిప్యూటి సీఎం భట్టి విక్రమార్కకు వివరించామని మధిర డివిజన్ ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రుపాలెం మండలంలో సింహభాగం అటవీ ప్రాంతం ఉండటంతో మండలాన్ని పర్యాటక అభివృద్ధి కేంద్రంగా మార్చాలని డిప్యూటి సీఎం ఆదేశాలతో పలు ప్రణాళికలు తయారుచేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా జమలాపురం ఆలయం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రం చేయాలని ఎప్పటి నుంచో ప్రతిపాదన ఉందని, అక్కడ అర్బన్‌పార్క్, చిల్డ్రన్‌పార్క్ ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. బుచ్చిరెడ్డిపాలెంలో ఇనిద్రమ్మ చెరువులో విహారయాత్ర చేసుకునేందుకు చెరువులో బోటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదించమన్నారు. సత్యనారాయణపురం గ్రామంలో గల చిన్న గుబ్బలమంగమ్మ ఆలయం వద్ద వాటర్‌ఫాల్స్ ఏర్పాటు కూడా పరిశీలనలో ఉందని అన్నారు. మొత్తంగా అంచనా వ్యయం సుమారు రూ.15కోట్ల వరకు అవుతుందని అన్నారు. వాస్తవిక అంచనా ప్రతిపాదనలను తయారుచేసి పంపాలని భట్టి కోరారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో మంజుల ఉన్నారు.

తమదైన మార్కు చూపుతారా!?

(5వ పేజీ తరువాయి)

తదితర అంశాలపై దృష్టిసారించాల్సి ఉంది. ఏజెన్సీ ఏరియా కావడంతో అక్కడ గిరిజనేతరుల సమస్యలు కూడా అనేకం ఉన్నాయి ఇళ్ల నిర్మాణానికి అనుమతులు లేకపోవడంతో పాటు రైతులకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి కీలక సమస్యల పరిష్కారం కొత్త కలెక్టర్‌కు సవాల్‌లాంటిదే. సింగరేణికి భూసేకరణపై కూడా ఆ జిల్లా కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రైతు రుణమాఫీ, రైతుభరోసా ప్రక్రియ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు రుణమాఫీ, సాగు సాయం పెంపు విషయంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం పెద్దసవాల్‌గా మారనుంది. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతర రైతుల భూములకు ఎక్కుశాతం పట్టాలులేవు. వీరికి రుణమాఫీ, సాగు సహాయం అందడం కూడా కష్టమే. ఇలాంటి సమస్యల పరిష్కారం కలెక్టర్లకు కత్తి మీద సాములాంటిదే.. ఇక ఉమ్మడి జిల్లాలో 30వేలకు పైగా ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని కూడా పరిష్కరించాల్సి ఉంది.

ప్రస్తుతం ఎడ్యుకేషన్ సీజన్ కావడంతో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయం పాటించడంలేదన్న ఆరోపణలున్నాయి. అనేక మంది టీచర్లు దూర ప్రాంతాలనుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిని సరిదిద్దాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వం ఎన్ని మౌళిక సదుపాయాలు కల్పించినా ఉపాధ్యాయుల పనితీరులో మార్పు రాకపోవడంతో ప్రభుత్వ విద్యావ్యవస్థ ఆశించిన స్థాయిలో ప్రగతి సాధించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో బయోమెట్రిక్ అమలు చేస్తేనే ఉపాధ్యాయుల విధి నిర్వహణ సక్రమంగా ఉండే అవకాశం ఉంది. ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో ప్రభుత్వ జేఎన్‌టీయూ కళాశాల మంజూరైంది. గత విద్యాసంవత్సరం ప్రారంభమైనా అక్కడ పూర్తిస్థాయి సదుపాయాలు లేక విద్యార్థులకు సరైన బోధన అందడం లేదు. దీనిపై ఖమ్మం కలెక్టర్ చొరవ తీసుకోవాల్సి ఉంది. అలాగే ఖమ్మంలో మెడికల్ కళాశాలకు స్థలం గుర్తించారు. ఖమ్మం, కొత్తగూడెం మెడికల్ కాలేజీలపై కొత్త కలెక్టర్లు దృష్టి సారించాల్సి ఉంది. అలాగే పీహెచ్‌సీలు ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్యులు, సిబ్బంది పనితీరుపైనా సమీక్షలు చేయాల్సి అవసరం ఉంది. ప్రస్తుత వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు నివారణతో పాటు క్షేత్రస్థాయిలో సాగు పరిస్థితులపై దృష్టిపెట్టాల్సి ఉంది.

ఇక ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ భూములు, ఎస్సైన్డ్, దేవాదాయ, రెవెన్యూ, భూదాన్, జమీందార్ మిగులు భూములు ఆక్రమణల పైనా కొత్త కలెక్టర్లు సమీక్ష చేపట్టాలి. ఉమ్మడి జిల్లాలో అనేక ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయి. విలువైన భూములను తప్పుడు ధృవీకరణ పత్రాలతో కబ్జాలు సాగించి తమ పలుకుబడితో క్రమబద్ధీకరణతో పాస్ పుస్తకాలు సృష్టిస్తున్నారు. భూ కబ్జాలపై కలెక్టర్లు కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఉంది. అలాగే మైనింగ్ దందా జోరుగా సాగుతోంది. గోదావరి, కిన్నెరసాని, మున్నేరు తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోంది. అక్రమార్కులు గిరిజన సొసైటీల పేరుతో ఇసుక అక్రమాలకు పాల్పడి కోట్లు గడిస్తున్నారు. భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో ఈ దంద అధికంగా నడుస్తోంది. ఇకొత్త కలెక్టర్లు ఇసుక దందాపై గ్రావెల్, గ్రానైట్ క్వారీలపై దృష్టి పెట్టి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది..



ఖమ్మంలో మూతబడిన థియేటర్

తెరమరుగు..

- నగరంలో మూతపడిన సినిమా హాళ్లు
- షాపింగ్ కాంప్లెక్స్‌లుగా రూపాంతరం

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 17: సినిమా అన్ని తరాల్లోనూ హృదయోల్లాసం కలిగించిన అత్యంత దగ్గరి మీడియా.. ఆంధ్రాలో విజయవాడ తరువాత నైజాం ప్రాంతంలో సినిమా వ్యాపారం మూడు బాక్సులు, ఆరు రీళ్లుగా వర్దిల్లింది.. ఖమ్మం నగరంలోనూ సినిమా హాళ్లకు ప్రేక్షకులు బ్రహ్మారథం పట్టేవారు.. ఖమ్మం లోనే కాక పరిసర అన్ని మండలాల్లో సినిమా హాళ్లు ఉన్నప్పటికీ సినిమా వెలుగు మాత్రం ఖమ్మంకే సొంతం అయ్యేది.. పరిసర మండలాల్లోని థియేటర్లకు సినిమాలు విడుదలైన తరువాత ఏడాదికో ఏడాదిన్నరకో వచ్చేది కాగా ఖమ్మంకు మాత్రం ఇతర ప్రధాన నగరాలకు దీటుగా కొత్త సినిమాలు వచ్చేవి.. దీంతో ఎప్పటికప్పుడు నగరంలోని వీధుల , కూడళ్ల గోడలకు కొత్త పోస్టర్లు కళకళలాడేవి.. ఉమ్మడి జిల్లా నుంచే కాక వరంగల్, నల్గొండ, కృష్ణా జిల్లాలకు చెందిన సరిహద్దు మండలాల, గ్రామాల ప్రేక్షకులు ఎడ్లబండ్లపై తరలి వచ్చేవారు..

రిక్షా మైకుల్లో సినిమాల ప్రచారాలు, కరపత్రాల పంపిణీతోపాటు పెద్ద పెద్ద బోర్డులను నగర వీధుల్లో ఊరేగింపు చేసేవారు. డప్పు మోతలతో, విద్యుత్ లైట్లతో ఊరేగింపు జరిగేది.. ఏ సినిమా హాలు చూసిన అన్ని తరగతులు ఫుల్ అయ్యేవి.. థియేటర్లలో వేసిన సీట్లు చాలక కొత్తగా టెంట్ హౌస్‌లనుంచికుర్చీలు తెప్పించి వేసేవారు.. ఉక్కబోతల్లో సైతం సినిమాను ఎంతో ఆదరించి అభిమానించిన ప్రేక్షకుల కాలాన్ని తలచుకుంటూ నేటి థియేటర్ల నిర్వాహకులు వాపోతున్నారు.. సినిమా థియేటర్లు సైతం ప్రేక్షకులు అభిమానులతో రద్దీగా కళకళలాడేవి.. కొత్త సినిమాలు, తమ అభిమాన హీరోల చిత్రాల సమయంలో అభిమానుల హడావుడి గత కాలపు జ్ఞాపకంగా మారింది.. సెకండ్ షో తరువాత అర్ధరాత్రి నుంచే థియేటర్లను అలంకరించటం, కటౌట్లు, పూల మాలలు, ఫ్లెక్సీలు ఏర్పాట్లు, పాల అభిషేకాలు, పుష్పాభిషేకాలు, స్వీట్ల పంపిణీ, బాణా సంచా కాల్చటం వంటి ఆనందాలతో పండుగ జరిపేవారు.. హీరోల అభిమానులు థియేటర్లను తమ సొంతంగా భావించే వారు. తమ హీరోకు సంబంధించిన చిత్రాలే అధికంగా ఆడాలని తపించేవారు.

సినిమాలను ఆడించే విషయంలో సైతం ప్రేక్షకులైన అభిమానులు థియేటర్ల యాజమాన్యాలకు, సిబ్బందికి తమ వంతు సహకరించే వారు. కాగా కాలక్రమేణా థియేటర్లకు గ్రహణం పట్టింది.. ప్రేక్షకుల సంఖ్య ఏటి కేడు తగ్గటంతో నగరంలో ఒక వెలుగు వెలిగిన అనేక సినిమా హాళ్లు మూత పడ్డాయి.. ప్రస్తుతం నగరంలో ఆడుతున్న సినిమా హాళ్ల కంటే మూత పడిన సినిమాహాళ్లేఅధికంగా ఉండటం సినిమా హాళ్లకు పట్టిన దుస్థితికి అద్దపడుతోంది.

నగరంలో సినిమా ప్రభ ఏవిధంగా వెలిగి కనుమరగయ్యిందనే వాస్తవానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. కార్పొరేషన్ సిటీగా అలరారుతూ హైదరాబాద్ తరువాత అంతటి వేగవంతమైన అభివృద్ధిని పొటెన్షియాలిటీని కలిగి ఉన్న ఖమ్మం నగరంలో ప్రస్తుతం ఆరు థియేటర్లు మాత్రమే కాగా.. మరో ఎనిమిది థియేటర్లు కాల గర్భంలో కలిసి పోవటం గమనార్హం.. వెంకటలక్ష్మి థియేటర్, అంబేటాకీస్, ప్రభాత్ టాకీస్, రాఘవ థియేటర్, రేవతి థియేటర్, వెంకటేశ్వర టాకీస్, నర్తకి, కిన్నెరసాని వంటి థియేటర్లు ప్రేక్షకుల్లేక మూత బడ్డాయి.. కాగా ఈ థియేటర్లు రియల్ ఎస్టేట్‌కు, షాపింగ్ మాల్స్‌కు మరలాయి.. షాపింగ్ కాంప్లెక్స్‌లుగా రూపాంతరం చెందాయి.. దీంతో ఖమ్మం నగరంలో గతకాలపు సినిమాహాళ్ల వైభవం మరపురాని జ్ఞాపకంగా మారింది.

పినపాక ఎమ్మెల్యేకు మాతృవియోగం

- ఫోన్ ద్వారా మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి పరామర్శ



పాయం రాములమ్మ

మణుగూరుటౌన్, జూన్ 17: భద్రాద్రి జిల్లా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి రాములమ్మ(85) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. రాములమ్మ మృతి సమాచారం తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో పాటు పలువురు ఎమ్మెల్యేలు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే పాయంను పరామర్శించారు. మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఇల్లెందు ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలతోపాటు నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులు, ఎస్‌కేటీ గ్రూప్ అధినేత దోసపాటి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న ఎంపీ బలరాం నాయక్

మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డితోపాటు నియోజకవర్గ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, ప్రభుత్వశాఖల అధికారులు ఎమ్మెల్యేను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ నాయకులు బి.అయోధ్య, కేవీ రావు, పుచ్చకాయల శంకర్, వాసిరెడ్డి చలపతిరావు, సీత, బచ్చల భారతి, పీవీ చారి, ఉడుమల లక్ష్మారెడ్డి, కంది సుబ్బారెడ్డి, పోశం నర్సింహారావు, ముత్యం బాబు, అడపా అప్పారావు, వేములపల్లి రమేష్, ముత్తినేని సుజాత, వాసు, యూనియన్ నాయకులు వి. ప్రభాకర్‌రావు, బోగినేని వరలక్ష్మి, గాదె కేశవరెడ్డి, టీడీపీ, సీపీఐ, సీపీఎం, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, ఆదివాసీ నేతలు, కాంట్రాక్టర్‌లు, వివిధ సంఘాల నాయకులు ఎమ్మెల్యేను పరామర్శించారు.

పీవైఎల్ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలి

● పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్

మధిర, జూన్ 17: ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులను జూలై 13,14తేదీలలో మధిరలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్ తెలిపారు. సోమవారం మధిరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతులకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రతినిధులు, రాష్ట్ర నాయకులు పలువురు అతిథులు పాల్గొంటారని తెలిపారు. ఈసభలను అన్ని వర్గాల వారు సహకరించి నైతిక మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో, కేంద్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయని, ప్రజలకు, యువతకు అందని ద్రాక్షపండులాంటి వాగ్దానాలను ఇచ్చారని తెలిపారు. దేశంలో 40కోట్ల మంది, రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా పాలకులకు చీమకుట్టినట్టుకూడా లేదని విమర్శించారు. నీట్ పరీక్ష పేపర్ల లీకేజీతో లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారిందని ఆరోపించారు. వెంటనే పరీక్ష పేపర్ల లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జిచేత న్యాయ విచారణ జరిపించాలని, ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వీ రాజేష్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్, సురేష్, సేవాలాల్, దేవా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్

ఏపీ మంత్రికి మిత్రుల అభినందనలు

పాల్వంచ టౌన్, జూన్ 17: ఇటీవల ఏపీలో కొలువు దీరిన మంత్రివర్గంలో భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖామాత్యులుగా బాధ్యతలు స్వీకరించిన ఏపీ మంత్రి కొల్లు రవీందర్‌ను పాల్వంచలోని అతని స్నేహితులు కిలారు చిన్ని (తిరుపతిరావు) ఆధ్వర్యంలో మంత్రి నివాసంలో సోమవారం కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసి అభినందించిన వారిలో అడ్వకేట్ నంబూరి రామకృష్ణారావు, రవీందర్ రెడ్డి, గుండా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఏపీ మంత్రి రవీందర్‌ను సత్కరిస్తున్న కిలారు చిన్న

కలెక్టర్ ప్రియాంక అల సేవలు వెలకట్టలేనివి

» జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు



కలెక్టర్ ప్రియాంక అల దంపతులను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్

చుంచుపల్లి, జూన్17: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా 11 నెలల పాటు విధులు నిర్వహించిన కలెక్టర్ ప్రియాంక అల సేవలు వెలకట్టలేనివని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు కొనియాడారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కలెక్టర్ ప్రియాంక అల దంపతులను శాలువతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచి సేవలను అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, ఏఎంసీ చైర్మన్ రాంబాబు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా ఉండేలా అంకుర ప్యాకేజీలు

ఖమ్మం, జూన్17(ఆంధ్రజ్యోతి): అంకుర ఆసుపత్రి ఎల్లవేళలా ఆడబిడ్డల ఆరోగ్య సంరక్షణలో భాగంగా నిత్యం తోడ్పడేందుకు కృషి చేస్తుందని ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ చల్లగుళ్ల రాకేష్, ఆసుపత్రి వైద్యులు అన్నారు. అంకుర ఆసుపత్రిని నూతన భవనానికి మార్చిన సందర్భంగా, వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు సంబంధించి ప్రతీ ఆడపిల్ల తన గర్భిణీ అయినప్పటి నుంచి ప్రసవం అయ్యేవరకు చేసే పలు రకాల టెస్టుల్లో రాయితీ ఇవ్వనున్నట్టు వారు ప్రకటించారు. ఖమ్మం నగరంలోని గొరిల్లా పార్కు ఎదురుగా ఏర్పాటు చేసిన ఆసుపత్రి నూతన భవనంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గర్భిణీలకు, మహిళలకు, పెళ్లి అయిన జంటల కోసం పలు ప్యాకేజీలను అందించనున్నట్టు వారు ప్రకటించారు. గర్భిణులకు ఎన్టీ, టిఫ్పా, ఒక గ్రోత్ స్కాన్, ఉచితంగా అనస్తీషియా చెకప్‌లతో పాటు ఒక గైనిక్ కన్సల్టేషన్‌ను మెటర్నిటీ ప్యాకేజీగా ఏర్పాటు చేసి ఆయా టెస్టుల్లో రాయితీ ఇస్తున్నట్టు వారు ప్రకటించారు. అందులోనే వెల్‌బేబీని పొందుపరుస్తూ డెలివరీ అయిన తర్వాత కూడా బేబీ కోసం ఒకసారి ఉచితంగా కన్సల్టేషన్, జీరో డోస్ వ్యాక్సిన్లో 50 శాతం, వెల్ బేబీ ఇన్వెస్టిగేషన్లో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు వారు పేర్కొన్నారు. అందుకోసం రూ.5వేలు చెల్లించి ప్యాకేజీ తీసుకుంటే డెలివరీ సమయంలో చెల్లించిన ప్యాకేజీ మొత్తాన్ని తగ్గించనున్నట్టు తెలిపారు. ఇక ఉమెన్ వెల్‌నెస్ ప్యాకేజీ పేరుతో మూడు రకాల ప్యాకేజీలను అందించనున్నట్టు తెలిపారు. 20ఏళ్ల వయస్సులో ఉన్న వారికి అవసరమైన రూ.2,650 విలువ చేసే టెస్టులను రూ.1,120కు, 30 ఏళ్ల వయస్సులో ఉన్న వారికి అవసరమైన రూ.6,350 విలువ చేసే టెస్టులను రూ.2,240కు, నలభై ఏళ్ల వయస్సులో ఉన్నవారికి అవసరమైన రూ.9,800 విలువ చేసే టెస్టులను రూ.3,333కు మాత్రమే నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉమెన్ వెల్‌నెస్ ప్యాకేజీ తీసుకున్నవారికి హెచ్‌పీవీ వ్యాక్సిన్‌లో 10 శాతం రాయితీ ఇస్తామన్నారు. మెటర్నిటీ, ఉమెన్ వెల్‌నెస్ ప్యాకేజీలు తీసుకున్న వారికి గురువారం రోజున ఉచిత కన్సల్టేషన్ ఉంటుందన్నారు. దానితో పాటుగా పెళ్లి అయిన జంటలకు అవసరమైన రూ.11వేల విలువైన టెస్టులను రూ.5,999కు అందిస్తామన్నారు. ఆ ప్యాకేజీలు తీసుకోవాలనుకున్న వారు జూలై 31లోగా రిజిస్టర్ చేయించుకోవాలని కోరారు. ఒకసారి రిజిస్టర్ చేసుకున్న వారు ఈ యేడాదిలో ఎప్పుడైనా వచ్చి తమ ప్యాకేజీలోని టెస్టులను చేయించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి వైద్యులు శ్వేత యుదిస్టిర్, నీలకుర్తి జోస్న, బొప్పుడి కల్పన, కందుకూరి సాయి ప్రసన్నలు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ రాకేష్, వైద్యులు

శిశువులకు శ్రీరామరక్ష

» పుష్కరకాలంగా 16 వేల మందికి పైగా చికిత్స

» నాలుగు రాష్ట్రాలకు అందుతున్న సేవలు

» ప్రత్యేకత చాటుతున్న భద్రాద్రి నవజాత శిశు చికిత్స కేంద్రం



ఎస్ఎన్‌సీయూ విభాగంలో చికిత్స పొందుతున్న శిశువులు

భద్రాచలం, జూన్ 17: నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లోని ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలోని ప్రత్యేక నవజాత శిశు చికిత్స కేంద్రం (ఎస్ఎన్‌సీయు) ఏజెన్సీ ప్రాంతంలోని శిశువులకు శ్రీరామరక్షగా నిలుస్తోంది. వివిధ సమస్యలతో వచ్చే శిశువులకు ఇక్కడ వైద్యం అందించేందుకు అధునాతన వైద్య పరికరాలతో పాటు వైద్యులు అందుబాటులో ఉన్నారు. దీంతో వారికి అత్యవసర వైద్యం సకాలంలో అందుబాటులోకి వస్తుండటంతో వేలాది మంది శిశువులకు ప్రాణాలను పోస్తున్నారు. కార్పొరేట్



ప్రత్యేక నవజాత శిశు చికిత్స కేంద్రం

వైద్యశాలల్లో వేలు, లక్షలతో అయ్యే ఖర్చు ఇక్కడ పూర్తి ఉచితంగా అందుతుండటంతో చత్తీస్‌గడ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నిరుపేదలు తమ శిశువులకు ఇక్కడ వైద్యం కోసం ఆశ్రయిస్తున్నారు. పుష్కరకాలంగా ఇక్కడ 16 వేల మందికి పైగా శిశువులకు వైద్య సేవలు అందడం గమనించదగ్గ విషయం. 19,663 మంది శిశువులు ఇక్కడ వైద్యం కోసం చేరగా 16 వేల మందికి చికిత్స అందించి ఇంటికి పంపారు. కాగా 1,280 మంది శిశువుల ఆరోగ్య పరిస్థితి అనుకూలించక మృతి చెందారు.



సిపాప్‌పై శిశువుకు చికిత్స

2012లో పది పడకలతో శ్రీకారం

ఏజెన్సీ ప్రాంతంలో జన్మించిన శిశువుల్లో పలువురు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారు. వీరిలోముందస్తుగా జన్మించిన శిశువులు లేదా తక్కువ బరువుతో జన్మించిన వారు, ఇతరత్రా వైద్యపరమైన సమస్యలను ఎదుర్కొంటున్న వారు ఉంటున్నారు. వీరికి ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో ఉన్న నవజాత శిశు కేంద్రంలో చికిత్స అందించడం జరుగుతోంది. దీంతో చిన్నారి శిశువులు పూర్తిస్థాయిలో ఆరోగ్యవంతులవుతున్నారు. 2012 ఆగస్టు 8న అప్పటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి నవజాత శిశు కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కాగా ఏజెన్సీ ప్రాంతంలో నవజాత శిశు కేంద్రంలో శిశువులకు మెరుగైన సేవలందుతుండటంతో ఆరంభంలో పది పడకలతో ఉన్న ఎస్ఎన్‌సీయులో పడకల సంఖ్య 2017లో 20 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదన వెళ్లిన క్రమంలోజాతీయ ఆరోగ్యమిషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ ఇందుకు సానుకూలంగా స్పందించింది. పది పడకలకు అదనంగా మరో పది పడకలను మంజూరు చేయడంతో భద్రాద్రి ఎస్ఎన్‌సీయులో వైద్య సేవలు మరింతగా శిశువులకు అందుతున్నాయి.

పుట్టినప్పటి నుంచి నెలలోపు వారికి

ఎస్ఎన్‌సీయులో పుట్టిన నాటి నుంచి నెలలోపు శిశువులకు అత్యాధునిక వైద్యం అందించడం జరుగుతోంది. కాగా కీలకమైన నవజాత శిశు కేంద్రాల్లో సంక్లిష్ట సమయాల్లో వెంటిలేటర్ లేక శిశువులు మృత్యువాత పడుతున్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వం మూడు వెంటిలేటరును ప్రత్యేకం గా ఎస్ఎన్‌సీయుకు మంజూరు చేయడంతో అవి సంక్లిష్ట సమయంలో శిశువులకు ప్రాణం పోస్తున్నాయి. అదేవిధంగా రేడియెంట్ వార్మర్స్ 24, సిపాప్ రెండు, ఫోటోథెరపీ యూనిట్లు 17 ఉన్నాయి. దీంతో శిశువులకు ఏజెన్సీ డివిజన్ కేంద్రంలోనే కార్పొరేట్‌స్థాయి వైద్యం అందించేందుకు వెసు లుబాటు ఏర్పడింది. ఇదిలా ఉండగా ఇందులో వైద్యాధికారుల పోస్టులు నాలుగు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం మూడు ఖాళీలు ఉన్నాయి. స్టాఫ్‌నర్సులు రెండు ఖాళీ ఉన్నాయి. సహకార సిబ్బంది పోస్టు ఒకటి ఖాళీగా ఉంది. ఈ ఖాళీలను సైతం భర్తీ చేస్తే శిశువులకు మరింతగా సేవలందే అవకాశం ఉంటుందని ఈ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. కాగా, భద్రా ద్రి నవజాత శిశు చికిత్స కేంద్రం 2022లో రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ సేవలందిస్తున్న కేంద్రంగా గుర్తింపు పొందింది. 2022లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఎంపిక చేయడం జరిగింది.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి



డిప్యూటీ సీఎం భట్టికి వినతిపత్రం అందిస్తున్న టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ నాయకులు

ఖమ్మంకార్పొరేషన్, జూన్17: జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలుపై టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందించారు. అనేక ఏళ్ల నుంచి జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్య పరిష్కారం కావడం లేదని భట్టీకి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా జర్నలిస్టులకు వెంటనే ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినప్పటికి సమస్య పరిష్కారం కాలేదని వినతిలో పేర్కొన్నారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రారవి తదితరులున్నారు.

నేడు టీయూడబ్ల్యూజే విస్తృతస్థాయి సమావేశం..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం ఉదయం 10గంటలకు నగరంలోని డీపీఆర్సీ భవన్‌లో నిర్వహిస్తున్నట్టు యూనియన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, కల్లోజు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శులు చిర్రారవి, షఫి తెలిపారు. ఈసమావేశానికి మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 17: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) ఆధ్వర్యంలో నిర్వహించే హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాలకు గాను మండల, జిల్లా స్థాయిలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలు మొదటగా మండల స్థాయిలో ఆయా మండలాల పరిధిలో ఈనెల 21 నుంచి 25 లోపు, అనంతరం జిల్లా స్థాయిలో ఈనెల 28, 29 తేదీలలో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపికలలో ప్రతిభ చూపిన వారిని జూలై 8 నుంచి 12 వరకు హైదరాబాద్‌లోని హకీంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపుతామని తెలిపారు.

ఒక వేళ మండల స్థాయిలో పాల్గొనలేని అభ్యర్థులు నేరుగా జిల్లాస్థాయి ఎంపికలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికలకు వచ్చే అభ్యర్థులు 2015 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్యలో జన్మించి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్, బోనఫైడ్, బర్త్, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కమ్యూనిటీ సర్టిఫికెట్‌తో పాటు 5 పాస్ పోర్టు సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. ఎంపికల్లో క్రీడాకారులకు ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగు, వర్టికల్ జంప్, 6+10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, మెడికల్ టెస్ట్ తదితర 10 రకాల బ్యాటరీ టెస్టులను నిర్వహిస్తారని తెలిపారు.

ఇల్లెందులో ప్రారంభమైన డయాలసిస్ చికిత్స

ఇల్లెందుటౌన్, జూన్ 17 : ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో కిడ్నీ రోగులకు డయాలసిస్ చికిత్సలు పునః ప్రారంభమయ్యాయి. గత వారం రోజులుగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నిలిచిపోయిన డయాలసిస్ చికిత్సలు సోమవారం నుంచి వైద్యులు ప్రారంభించారు. 42మంది కిడ్నీ రోగులకు ప్రతిరోజు ఈ వైద్యశాలలో డయాలసిస్ సేవలు అందుతున్నాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా సేవలు నిలిచిపోవడంతో వారం రోజులుగా మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం వైద్యశాలలకు కిడ్నీ రోగులు తరలిపోయేవారు. సోమవారం నుంచి ఈ వైద్యశాలలో డయాలసిస్ చికిత్సలు ప్రారంభం కావడం పట్ల కిడ్నీరోగులు హర్షం వెలిబుచ్చుతున్నారు.



రోగులకు డయాలసిస్ చేస్తున్న దృశ్యం

రామయ్య గోత్రప్రవరలపై

అభిప్రాయసేకరణ

» నేడు భద్రాచలానికి విచారణ కమిటీ ?

భద్రాచలం, జూన్ 17: భద్రాద్రి రామయ్య గోత్ర ప్రవరల విషయంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఏర్పాటైన ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ మంగళవారం భద్రాచలానికి రానున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా సదరు కమిటీ సభ్యులు ఆలయంలో పనిచేస్తున్న వైదిక సిబ్బందితో పాటు విశ్రాంత వైదిక సిబ్బంది నుంచి అభిప్రాయాలను సేకరించే అవకాశం ఉన్నట్లు భద్రాచలంలో చర్చ జరుగుతోంది. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత సిబ్బందికి దేవస్థానం అధికారులు సమాచారం అందించినట్లు సమాచారం. కాగా గోత్ర ప్రవరల అంశం న్యాయస్థానం పరిధిలో ఉండడంతో కమిటీ ముందు ఆయా వ్యక్తులు వ్యక్తపరిచే అభిప్రాయాలు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి రావద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వినికిడి. అదే విధంగా ఆలయంలో జరిగే వైదిక కార్యక్రమాలను సైతం కమిటీ సభ్యులు పరిశీలించనున్నట్లు సమాచారం. మూడు రోజుల పాటు ఈ కమిటీ భద్రాచలంలో పర్యటించనుందని, ఈ క్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు సైతం ఈ పర్యటనలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు వినికిడి. గోత్ర ప్రవరల అంశం న్యాయస్థానం పరిధిలో ఉండడంతో దేవస్థానం అధికార, వైదిక వర్గాలు ఈ అంశంపై మాట్లాడేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

» ఇల్లెందు స్టేషన్‌బస్తీలోని

రెండెకరాల స్థలంలో పందిళ్ల ఏర్పాటు

ఇల్లెందు టౌన్, జూన్ 17: ఇల్లెందు పట్టణంలోని స్టేషన్ బస్తీలో గల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించారు. సోమవారం స్టేషన్‌బస్తీ సమీపంలో గల సుమారు 2 ఎకరాల ప్రభుత్వ భూమిలో బస్తీకి చెందిన కొంతమంది నిరుపేదలతోపాటు పలువురు ఈ ఆక్రమణకు పాల్పడ్డారు. సింగరేణి లీజు అనంతరం ప్రభుత్వానికి యాజమాన్యం అప్పచెప్పగా, గతంలో ఇదే భూమిలో ఎంహెచ్‌ఎంఈ సంస్థ ద్వారా పరిశ్రమల ఏర్పాటు కోసం అప్ప టి ప్రజాప్రతినిధులు సైతం పరిశీలించి నిర్మాణాల కోసం కృషి చేశారు. అనంతరం ఎంహెచ్‌ఎం ఈ నిర్మాణాలు లేకపోగా, ఖాళీగా ఉన్న స్థలంపై బస్తీవాసులు ఆక్రమణకు పాల్పడ్డారు. బక్రీదు సెలువు దినం కావడంతో ప్రభుత్వ అధికారులు ఎవరు కూడా అందుబాటులో లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన ఆక్రమణదారులు సర్కారు స్థలంలో గుడిసెలు వేసేందుకు పందిళ్లను ఏర్పాటు చేయడం గమనార్హం.

పెట్రో కారు తగిలి ముగ్గురికి గాయాలు

ఖమ్మం క్రైం జూన్ 17: పెట్రో కార్ తగిలి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. స్థానిక సమాచారం మేరకు అగ్రహారం కాలనీ కొత్తూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల వారి తండ్రి మృతి చెందడంతో ఆదివారం 11వ రోజు కార్యక్రమం ముగించుకొని ద్వి చక్ర వాహనంపై కురవిలోని టెంపుల్‌లో నిద్రచేసేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ముస్తఫానగర్ సమీపంలోని మిషన్ హాస్పిటల్ వద్ద ఎదురుగా వస్తున్న పోలీస్ పెట్రో కార్ తగిలి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయినట్టు స్థానికులు తెలిపారు. అదేవిధంగా పెట్రో కార్ డ్రైవర్‌గా ఉన్న కానిస్టేబుల్ మద్యం సేవించి వాహనం నడిపినట్టు పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతుంది. కాగా ఈ ఘటనపై సంబంధిత పోలీసు అధికారిని అడగగా, ఎదురుగా వస్తున్న ముగ్గురు త్రిబుల్ రైడింగ్‌తో అతివేగంగా వచ్చి, పెట్రోకార్‌కు తగిలారని, ఇరువురు మద్యం సేవించలేదని తెలిపారు. కాగా ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి కేసు నమోదు కూడా కాలేదని సదరు అధికారి తెలిపారు.

రెగ్యులర్ ఎంఈవోలు నలుగురే..

»మిగిలిన 19 మండలాలకు ఇన్‌చార్జిలే గతి

» పర్యవేక్షణ లేక పాఠశాలల్లో దిగజారుతున్న ప్రమాణాలు

»న్యాయపర వివాదాలతో నియామకాల్లో జాప్యం

» భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో విద్యారంగం దుస్థితి

మణుగూరు, జూన్17: ఈ విద్యాసంవత్సరం కూడా ఎంఈవోలు లేకుండానే ప్రారంభమైంది. రెగ్యులర్ ఎంఈవోల నియామకాల్లో తీవ్ర జాప్యంతో జిల్లా విద్యారంగం కుంటు పడుతోంది. ఏ ఏడుకాయేడు గుణనాత్మక విద్య మిథ్యగానే మారుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23 మండలాల్లో మండల విద్యా శాఖ అధికారులు శాశ్వతంగా ఉంటూ మండలంలోని సర్కారు బడుల పరిపాలన, పరిశీలన వ్యవహారాలను చక్కదిద్దాల్సి ఉంటుంది. సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు తోడ్పాటు అందించాల్సి ఉంది. ఉపాధ్యాయులపై పర్యవేక్షణ చేస్తూ, ప్రతి పాఠశాల మంచి ప్రగతిని ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించడంలో తన వంతు బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది. అలాంటి అధికారే ఆయా మండలాల్లో లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచిస్తే ఇట్టే అవగతం అవుతుంది. పిల్లలు చదువులు దుస్తులు, విద్యాబోధన, ఆటపాటలు ఇలా ప్రతి అంశంలో వెనకబాటు తనం సుస్పష్టంగా తెలుస్తోంది.

నాలుగేళ్లుగా ఇన్‌చార్జిలే

జిల్లాలో ఇలాంటి పరిస్థితులు నెలకొని నాలుగేళ్లు కావస్తోంది. ఇన్‌చార్జి మండల విద్యాశాఖాధికారులే తమకున్న అవకాశాల మేరకు వారికి కేటాయించిన బాధ్యతలను నడిపిస్తున్నారు. ఒక ఎంఈవో మూడు నుంచి నాలుగు మండలాల విద్యాశాఖాధికారి విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. బూర్గంపాడు, భద్రాచలం, దమ్మపేట మండలాలకు ఎంఈవోగా-ఎస్ సమ్మయ్య, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం, పినపాక మండలాలకు-వీరాస్వామి, గుండాల ఆళ్లపల్లి, అశ్వారావుపేట మండలాలకు-కృష్ణయ్య, చర్ల, కొత్తగూడెం, చుంచుపల్లి , లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాలకు-జుంకీలాల్, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాలకు-సత్యనారాయణ, పాల్వంచ, ములకలపల్లి మండలాలకు-శ్రీరామమూర్తి, జూలూరుపాడు మండలానికి-వెంకటేశ్, టేకులపల్లికి-రామ్‌సింగ్‌ఠాగూర్ ఇల్లెందుకు-శ్రీనివాస్‌లు దమ్మపేట మండలానికి-లక్ష్మి ఎంఈవోలుగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 23 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు 1,081 పాఠశాలలు ఉండగా వీటిలో అశ్వారావుపేట, చర్ల, దమ్మపేట, టేకులపల్లి, ములకలపల్లి, పినపాక మణుగూరు, జూలూరు పాడు, లక్ష్మీదేవిపల్లి, దుమ్ముగూడెం, అశ్వాపురం, పాల్వంచ మండలాల్లో 40 నుంచి 79 పాఠశాలల చొప్పున ఉన్నాయి. జిల్లాలో నాలుగు మండలాలకు తప్ప, మిగితా మండలాలల్లో అంతా ఇన్‌చార్జి ఎంఈవోల వ్యవస్థే నడుస్తోంది. దీంతో ఎంఈవోలు తమ మండలాలతో పాటు ఇతర 19 మండలాల బాధత్యలను ఇన్‌చార్జిలుగా వ్యవహారిస్తూ మోస్తున్నారు.

మాకే పదోన్నతి కావాలి

ఎంఈవోల పదోన్నతుల విషయంలో మాకంటే మాకు అంటూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల మధ్య నెలకొన్న వివాదం మూలంగా రెగ్యులర్ ఎంఈవోల నియామకంలో జాప్యం చోటుచేసుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు కామన్ రూల్స్ అనే అంశంపై హైకోర్టును ఆశ్రయించి ఆ తర్వాత సుప్రీం కోర్టులో కేసు వేసినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై స్పందించిన ప్రభుత్వం ఆరవై నలభై శాతం ప్రాతిపాధికన ఎంఈవోల పదోన్నతులు చేపట్టేందుకు ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులను ఒప్పించే ప్రయత్నం చేసినట్లు వినికిడి. ఈ విషయంపై రాజీ పడని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కొందరు యూనియన్ తరుపున సుప్రీం కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. దీంతో ఈ సమస్య కోర్టు పరిశీలనలో ఉంది. నాలుగేళ్లు కావస్తున్నా కోర్టు నుంచి ఉత్తర్వులు రాకపోయే సరికి ఇన్‌చార్జిల తో నే జిల్లా విద్యావ్యవస్థ నడుస్తోంది.



ఎంఈవో కార్యాలయం

లారీ ఢీ కొని వ్యక్తి మృతి

పినపాక, జూన్ 17: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గొట్టెల్ల గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆళ్లపల్లి మండలంలోని కిచ్చనపల్లి గ్రామానికి చెందిన వజ్జా వెంకయ్య (56) సోమవారం గొట్టెల్ల గ్రామంలో బంధువు దశదిన ఖర్మలకు హాజరై తిరిగి వెళ్లేందుకు రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 సాయంతో మణుగూరు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న ఆటో

● యువకుడికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు, జూన్ 17: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మాచినేనిపేట పంచాయతీ పరిధిలోని గోపాతండా గ్రామం వద్ద సోమవాం చోటు చేసుకుంది. గురవాగుతండా గ్రామానికి చెందిన భూక్య కళ్యాణ్ అనే యువకుడు గ్రామం నుంచి పడమటనర్సాపురం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో కళ్యాణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు క్షతగాత్రుడని 108 లో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గోవధను అడ్డుకున్న బీజేవైఎం కార్యకర్తలు

● పలువురి అరెస్టు

ఇల్లెందురూరల్, జూన్17: ఇల్లెందు మండలం నిజాంపేట గ్రామంలోని మామిడితోటలో సోమవారం గోవధను బీజేవైఎం కార్యకర్తలు అడ్డుకున్నారు. గోవధ చేస్తున్న పలువురిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇల్లెందు పోలీస్ సీఐ బత్తుల సత్యానారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణానికి చెందిన కొందరు 7 గోవులను ట్రాలీలో తీసుకొచ్చి ఇల్లెందు మండలం నిజాంపేట గ్రామ సమీపంలో మామిడితోటలో గోవధ చేస్తున్నారని బీజేవైఎం కార్యకర్తలు పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. వారి సమాచారం మేరకు గోవధ చేస్తున్న పలువురిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. స్థానిక పశువైద్యాధికారి రాజేష్ వధించబడిన గోవులను పంచానామా చేసి పూడ్చివేశారు. గోవధ చేస్తున్న పలువురిపై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సింగరేణి మెడికల్ బోర్డులో అక్రమాలు ఆగేనా?

» ఏసీబీ, సీఐడీ విచారణతో పైరవీకారుల్లో ఆందోళన

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 17: సింగరేణి మెడికల్ బోర్డులో జరుగుతున్న అక్రమాలను రూపుమాపేందుకు సింగరేణి యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తాయన్నది ప్రశ్నార్థంగా మారింది. సింగరేణిలో మెడికల్ బోర్డు ద్వారా కార్మికుల వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇచ్చేందుకు మెడికల్ బోర్డును ఏర్పాటు చేశారు. మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ అయిన కార్మికుల వారసులకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. దీంతో సింగరేణి వ్యాప్తంగా అనేక మంది కార్మికులు తమ వారసులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు మెడికల్‌బోర్డును ఇచ్చేందుకు ఆశ్రయిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మెడికల్‌బోర్డులో అన్‌ఫిట్ చేయాల్సి ఉండగా, కొంతమంది పైరవీకారులు ఆరోగ్యంగా ఉన్న వారిని సైతం అన్‌ఫిట్ చేసేందుకు బేరసారాలు చేసి అన్‌ఫిట్ చేస్తున్నారు. దీంతో మెడికల్ బోర్డు పైరవీలకు లక్షలాది రూపాయలు మారుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఇటీవల సింగరేణి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం మెడికల్ బోర్డులో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరపాలంటూ ఏసీబీ అడిషనల్ డీజీపీ పీవీ. ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు.

దీంతో సింగరేణ వ్యాప్తంగా ఏసీబీ, సీఐడీలు విచారణలు జరుపుతున్న నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో సింగరేణి మెడికల్‌బోర్డు కొనసాగుతుంది. దీంతో మెడికల్ బోర్డులో అక్రమాలు ఆగుతాయా.. పైరవీల పర్వం కొనసాగుతుందా అని తెలియాల్సి ఉంది. రెండు రోజులపాటు జరిగే మెడికల్ బోర్డుకు సింగరేణి పరిధిలోని 12 ఏరియాలకు సంబంధించిన 204మందికి అధికారులు సమాచారం అందించగా సోమవారం జరిగిన మెడికల్ బోర్డుకు 30మంది గైర్హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. గట్టి నిఘా ఉండటం వల్ల ఎక్కువ మంది గైర్హాజరయ్యారనే ప్రచారం కొనసాగుతోంది. ఏది ఏమైనా సింగరేణి మెడికల్ బోర్డులో అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి దళారులను నమ్మ వద్దు అంటూ ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు.



సింగరేణి ప్రధాన ఆసుపత్రి

మూకమామిడి ప్రాజెక్టును పట్టించుకోని ప్రభుత్వాలు


» బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్

కొత్తగూడెం/ములకలపల్లి, జూన్ 17: మండలంలోని మూకమామిడి ప్రాజెక్టును ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ ఆరోపించారు. సోమవారం స్థానిక గ్రామస్థులతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూకమామిడి ప్రాజెక్టు సుమారు 45 సంవత్సరాల క్రితం 160 మిలియన్ క్యూబిక్ ఫిట్ సామర్థ్యంతో అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మించిందన్నారు. ఈ ప్రాజెక్టు కింద సుమారు పది గిరిజన గ్రామాలకు వ్యవసాయ అవసరాలు తీరుతాయని అన్నారు. ఈ ప్రాజెక్టు సుమారు 378 ఎకరాల్లో విస్తరించి ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తిగా నిండితే అలుగు ద్వారా సుమారు 15,570 క్యూసెక్కుల నీరు వెళ్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా గిరిజన ప్రాంతాలైన పది గ్రామాలకు నీరు అందుతుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 3,260 ఎకరాల సాగు జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం 2019 సంవత్సరంలో సుమారు రూ.9కోట్లు మంజూరు చేసిందని, దానిలో రూ.6కోట్ల పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఇంకొక మూడు కోట్ల పనులు చేయాల్సి ఉందని అన్నారు. ఈ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వకు నీరు పోయే మార్గం దగ్గర గేట్లకు సంబంధించిన మిషనరీష్ శిథిలావస్థలో ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి అవసరమైన వనరులను ఈ ప్రభుత్వం మంజూరు చేసే దాకా బీజేపీ పార్టీ తరపున పోరాటం చేస్తామన్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో ఇరిగేషన్, పర్యాటకశాఖ వారికి బీజేపీ పార్టీ తరపున ఈ సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ మూకమామిడి ప్రాజెక్టుకు సంబంధించి నీటి నిల్వ వ్యవహారంగాని మూకమామిడి ప్రాజెక్టు యొక్క కుడి, ఎడమ కాల్వల మరమ్మతులు, అలుగు, తూము ప్రాజెక్టులో ఉన్న వంతెన యొక్క మరమ్మతుల కోసం సంబంధిత జిల్లా, రాష్ట్ర అధికారులకు సంబంధిత మంత్రులకు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల ఐలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బిజ్జం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కేశగాని శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు, చుంచుపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండల అధ్యక్షులు రాయుడు నాగేశ్వరరావు, భూక్య రాజేష్, పోలోజు క్రాంతి, పాల్వంచ పట్టణ అధ్యక్షులు రాపాక రమేష్, కటికల రంజిత్, గుగులోత్ శంకర్, శనగపాటి సీతారాములు, మాదారపు లక్ష్మణ్, నరేందర్, కమురుద్దీన్, తోట వెంకటేశ్వర్లు, పొన్నూరు భాను తేజ, పూనెం నవీన్, వట్టెం వంశీ, తదితరులు పాల్గొన్నారు.



మూకమామిడి ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



కరకగూడెంలో..

త్యాగానికి, సామరస్యానికి ప్రతీక బక్రీద్

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



పాల్వంచలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు

కొత్తగూడెం జూన్ 17 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి, సామరస్యానికి ప్రతీక బక్రీదు పండుగ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బక్రీదు పండుగను పురస్కరించుకుని సోమవారం పట్టణ పరిధిలోని బోబగుట్ట, రుద్రంపూర్ ఈద్గా, మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్‌పాషా, ముస్లీం మైనార్టీ నాయకులు, పెద్దలు నయిమ్ ఖురుషీ, ఫారూఖ్‌యజ్డాని, అమీర్, ఇక్బల్, శ్రీనివాస్, ఎండి. యూసుఫ్, జహీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా బక్రీద్‌ను ముస్లిం సోదరులు భక్తి శ్రద్దలతో నిర్వహించారు.



కొత్తగూడెం ఈద్గాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని



భద్రాచలంలో..



అశ్వారావుపేటలో..



కొత్తగూడెం డీఎస్పీతో తొర్రూరుకు చెందిన రైతులు



ఇల్లెందులో..



జూలూరుపాడులో..



దుమ్ముగూడెంలో..



బూర్గంపాడులో ప్రార్థనలు



ఆళ్లపల్లిలో..



ఆళ్లపల్లిలో..



దమ్మపేటలో..

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే కూనంనేని

సుజాతనగర్, జూన్ 17: బక్రీద్ పర్వదిన సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుని సోమవారం సుజాతనగర్ మండల వాసులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సుజాతనగర్‌లో నెలకొన్న సమస్యలను వారికి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అందరూ కలిసి కట్టుగా పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారానికి వచ్చినందుకు వారిని అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో. రైతు సంఘం నాయకులు తాళ్లూరి ధర్మారావు, పాపారావు, సీపీఐ మండల నాయకులు బొడ్డు కేశవరావు, బొడ్డు బుజ్జి, చింతలపుడి సాయి, గురజాల సీతయ్య, గంగాధర కోటి, చాగంటి వెంకటేశ్వర్లు, గడ్డం రామారావు, గురజాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు రూ. 25వేల విరాళం



నగదును అందజేస్తున్న వెంకటనారయణ

జూలూరుపాడు, జూన్ 17: మండలంలోని పాపకొల్లు గ్రామంలో శ్రీ ఉమాసోమలింగేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న అభయాంజనేయ స్వామి విగ్రహనికి అదే గ్రామానికి చెందిన ధర్మరాజుల వెంకటనారయణ అనే భక్తుడు రూ. 25,116లు విరాళంగా అందజేశారు. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావుకు నగదును అందించారు. ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు వెంకటనారయణను అబినంధించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాణోత్ స్వాతి, రోకటి రంగారావు, విశ్రాంత ఎంఈవో మద్దిశెట్టి వెంకటేశ్వరరావు, పూసాల శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రగళ్లపల్లి పథకం నుంచి నీటి విడుదల

దుమ్ముగూడెం జూన్ 17:ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులకు వానాకాలం పంట వరినారు పెంపకం కోసం సాగునీటిని కమిటీ అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సీతమ్మ సోమవారం విడుదల చేశారు. సూరారం, ఎస్‌కొత్తగూడెం, కాశీనగరం, చినబండిరేవు పరిదిలో నాలుగు వందల ఎకరాల్లో వరి సాగుకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. రైతులు కొమ్ము రంజిత్‌కుమార్, పిట్టా శ్రీనివాసు, మునీంద్ర, సీహెచ్ సత్యనారాయ ణలున్నారు.

ఇఫ్టూ మణుగూరు నూతన కమిటీ ఎన్నిక

మణుగూరు , జూన్ 17: మణుగూరు ఏరియా ఇఫ్టూ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని డీవీ ఫంక్షన్ హాల్‌లో పెనుగొండ నాగరాజు ప్రాంగనంలో ఇఫ్టూ మణుగూరు ఏరియా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెల్ల అశోక్, కార్యదర్శిగా బొల్లం మల్సూరు. సహాయ కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వేర్పుల జానయ్య, కోశాదికారిగా జంపాల యాకయ్యలతో పాటు 12 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్ మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భద్రాచలం, జూన్ 17: భద్రాచలంలో మంగళవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ తెలిపారు. పట్టణంలో ఉన్న రెండు సబ్ స్టేషన్‌లలో అత్యవసర మరమ్మతులు చేయాల్సి ఉన్నందున విద్యుత్తు నిలిపివేస్తున్నామని, ఈ అసౌకర్యంకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత మహిళకు ఆర్థిక సహాయం

భద్రాచలం, జూన్ 17: భద్రాచలంలో పక్షవాతంతో బాధపడుతున్న యశోద అనే మహిళకు పరివర్తన యశోద ఫౌండేషన్ సేవా సమితి వారు రూ.3 వేల ఆర్థిక సహాయాన్ని సంస్థ అధ్యక్షుడు కొమ్మగిరి వెంకటేశ్వర్లు, అప్పన దాసుబాబులు అందించారు. ఈ కార్యక్రమంలో మారం ఈశ్వర్‌రెడ్డి, లంకా యుగేందర్, నిహల్, అలవాల రాజా పెరియార్, సతీష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు

దమ్మపేట,జూన్ 17: అక్రమంగా తరిలిస్తున్న రేషన్‌బియ్యాన్ని దమ్మపేట పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. వివరాల ప్రకారం అల్లిపల్లి బోర్డర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మిని ట్రక్కులో 15 క్వింటాల రేషన్ బియ్యాన్ని ఏలూరు తరిలిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని, ట్రక్‌ను అదుపులోకి తీసుకొని దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు తరిలించారు. అక్రమంగా బియ్యం తరలింపు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పర్ణశాల సందర్శించిన కర్నాటక ఎన్నికల కమిషనర్



స్థలపురాణాన్ని వివరిస్తున్న సిబ్బంది

దుమ్ముగూడెం జూన్ 17:ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాలను కర్ణాటక రాష్ట్ర ఎన్నికల కమిషనర్ డాబిబసవరాజు దంపతులు సోమవారం సందర్శించారు. బాపు కుటీరం, నారచీరలప్రాంతాలను దర్శించుకున్నారు. పర్ణశాల పుణ్యక్షేత్రం స్థల పురాణాన్ని ఆలయ సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్ణశాల ప్రత్యేక అధికారి అనీల్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది జయబాబు ఉన్నారు.

న్యూడెమోక్రసీ నుంచి గోపన్న బహిష్కరణ

ఇల్లెందు టౌన్, జూన్ 17: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దరసరి సమ్మయ్య అలియాస్ గోపన్నను రాష్ట్రకమిటి నుంచి బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి అశోక్ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఇల్లెందులో ప్రకటన విడుదల చేశారు. గోపన్న పార్టీలో పని చేస్తున్నట్లు నటిస్తూ పార్టీకి సంబంధించిన విషయాల్లో శత్రువులకు చేరవేస్తున్నారని అశోక్ ఆరోపించారు. అదేవిధంగా పార్టీ రహస్యాలను రాజకీయ శత్రువులతో కుమ్మక్కై నిర్మాణ వ్యతిరేక ముఠాచర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పార్టీని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని అందు వల్లనే పార్టీ రాష్ట్రకమిటీ నుంచి ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నామని అశోక్ వెల్లడించారు. గోపన్ననను విమర్శించే తమ పార్టీ నాయకులను బెదిరింపులకు పాల్పడుతున్నారని ఇలాంటి పద్దతులు మానుకోకపోతే తగిన ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

ఉమ్మడి పినపాక మండలంగానే మినీ గురుకులం అడ్మిషన్స్ కేటాయించాలి

కరకగూడెం, జూన్ 17: పినపాక మండలం ఐలాపురం మినీ గురుకులం పాఠశాలలో ఒకటవ తరగతి అడ్మిషన్ల విషయంలో ఉమ్మడి పినపాక మండలంగానే కరకగూడెం మండలంలో కూడా అడ్మిషన్స్ కేటాయించాలని కరకగూడెం మండల సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరకగూడెం మండలంలో మినీ గురుకులం అడ్మిషన్లు కేటాయించాలని మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. నూతంగా ఏర్పడిన కరకగూడెం మండల గిరిజన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఉమ్మడి పినపాక మండలంగానే కరకగూడెం మండలంలో మొదటి ప్రాధాన్యత ఇచ్చేలా ఐటీడీఏ అధికారులు గురుకులం సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికే విద్యుత్ ప్రజావాణి

» ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ బీకాంసింగ్ » విద్యుత్ వినియోగదారుల నుంచి వినతిపత్రాల స్వీకరణ

కొత్తగూడెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కారం కోసం నిర్వహించే విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ బీకాంసింగ్ కోరారు. సోమవారం కొత్తగూడెంలో డివిజన్ ఇంజనీరింగ్ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ ఏరియాల నుంచి విద్యుత్ వినియోగదారులు 35మంది పలు సమస్యలపై ఫిర్యాదులు చేయగా 13 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ మందయ్య, ఏడీఏ హేమచంద్రబాబు, ఈఆర్‌వో లావణ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ప్రజావాణిలో మాట్లాడుతున్న అధికారులు

లోవోల్టేజ సమస్యను పరిష్కరించండి

దమ్మపేట: దమ్మపేటలో లోవోల్టేజి సమస్యను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ విని యోగదారులు ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందజేశారు. దమ్మపేట, గండుగులపల్లి సబ్‌స్టేష న్, విద్యుత్ కార్యాలయాల్లో సోమవారం విద్యుత్ ప్రజావాణీ కార్యక్రమాన్ని విద్యుత్ అధికారులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దమ్మపేటకు చెందిన పలువురు రైతులు, వినియోగదారులు మాట్లాడుతు దమ్మపేటలో త్రీవంగా లోవోల్టేజి సమస్య వుందని, చెట్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ లైన్లను మార్పిడి చేయాలని, విద్యుత్‌వైరు తోటల్లో కిందికు వాలిపోయివున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సంబందిత అధికారుల మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గం.లనుంచి 1గం.వరకు నిర్వహించే విద్యుత్ ప్రజావాణీ కార్యక్రమాన్ని వినియోగించి వినియోగదారుల సమస్యలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈలు సాయికిరణ్, మహేష్, వెంకట్‌లు, ఎల్ఐలు ప్రసాద్, వెంకటేశ్వేశ్వరరావు, చక్రధర్, ఎల్ఎంలు ప్రసాదు, రామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం విద్యుత్ సబ్-స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల నుంచి మూడు ఫిర్యాదులందినట్లు సబ్-ఇంజనీర్ రాజేష్ తెలిపారు. జీరో బిల్లు రాని అర్హులుంటే మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ తోటల్లో విద్యుత్తు లైన్లు మార్చాలి

అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని పామాయిల్ తోటల్లో గతంలో వేసిన విద్యుత్తు లైన్ల వలన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్తు లైన్లను మార్చాలని తెలంగాణా ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ పామాయిల్ గ్రోవర్ సోసైటీ నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య కోరారు. అశ్వారావుపేట విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యుత్తుశాఖ ఏడీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఏడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘం ద్వారా వచ్చిన వినతిని వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు.

108 పైలట్ కుటుంబానికి బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ప్రోగ్రామింగ్ అధికారి

పినపాక, జూన్ 17: మండలంలోని ఉప్పాక గ్రామానికి చెందిన 108 పైలట్ కాళేవారు సాయికుమార్ గత ఏడాది మృతి చెందాడు. కాగా 108 భాగస్వామి సంస్థ అయిన ఈఎంఆర్ఐ సాయికుమార్ కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును జిల్లా 108 ప్రోగ్రామింగ్ అధికారి భూమా నాగేందర్ సోమవారం అందజేశారు. చెక్కును బాధితుడి తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో ఈఎంఈ దుర్గాప్రసాద్, 108 సిబ్బంది అప్పిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దందాను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ నాయకులు

కరకగూడెం, జూన్ 17: జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దందాను అధికారులు అరికట్టాలని ఎస్ఎస్ఎఫ్(నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కరకగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చదువుకునే రోజులు పోయి చదువును కొనుక్కునే రోజులు వచ్చాయన్నారు. జిల్లా అధికారులు స్పందించి అధిక వసూళ్ళకు పాల్పడుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ నాయకులు దుర్గం సందీప్, సురేందర్, జాడి ప్రకాష్, జిమ్మిడి జగదీష్, జాడి దినేష్, రితీష్, జాడి వినయ్ పాల్గొన్నారు.

వైద్యశాలకు తరలింపు

భద్రాచలం, జూన్ 17: రామాలయం సమీపంలో బిక్షాటన చేసే ఓ వృద్దుడికి కాలుజారి నడవలేని స్థితిలో ఉండటంతో సోమవారం గమనించిన కడాలి నాగరాజు అనే వ్యక్తి 108 సహాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం యాచకుడికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు సిమెంటు కట్టు వేసి వైద్యశాలలోనే ఉంచి 45 రోజుల పాటు వైద్యం అందిస్తామని తెలిపారు.

ప్రతి దుకాణదారుడు నిబంధనలు పాటించాలి: ఏవో



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసయాధికారి

చర్ల, జూన్ 17: చర్ల మండలంలోని విత్తన,పురుగు మందు దుకాణ దారులు నిబంధనలు తప్పకుండా పాటించాలని చర్ల వ్యవసాయశాఖ అధికారి శివరాం ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన రైతుల అవసరమే అవకాశంగా' అనే కధనానికి ఆయన స్పందించారు. సోమవారం సెలవు అయినప్పటికీను చర్ల మండలంలోని విత్తన, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ వివరాలను నమోదు చేసుకున్నారు. దుకాణదారులు తప్పకుండా రిజిష్టర్ వినియోగించాలని, స్టాక్ వివరాలు అందులో పొందుపర్చాలని సూచించారు. అలాగే దుకాణాల ముందు తప్పకుండా ధరల పట్టికలు, స్టాక్ వివరాలు ఉండాలని, ప్రతీ రైతుకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. సందర్బంగా ఏవో మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దుకాణదారులు వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. ఎరువులు, మందులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఫిర్యాదులు వస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏవో వెంట వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలనే ఎంపిక చేసుకోవాలి: ఏడీఏ

గుండాల: ఈ ఖరీఫ్‌లో వివిద రకాల పంటలు సాగుచేసే రైతులు అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని ఏడీఏ తాతారావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మన గ్రోమోర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు తీసుకునే రైతులు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మానాల వెంకటేశ్వర్లు, తిరుక్కొవళ్లూరి వెంకన్న, ఈసం క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంచెల ఏర్పాటు కాదు.. శాశ్వత పరిష్కారం చూపాలి

» ఎంపీపీ సత్యం » కిన్నెరసాని, బండిరేవు వాగులపై వంతెనలు లేకపోవడంతో ఇబ్బందులు



మాట్లాడుతున్న ఎంపీపీ ముక్తి సత్యం

గుండాల, జూన్ 17: వర్షాకాలం వచ్చిందంటే వాగులపై వంతెనలు దాటకుండా కంచెలు ఏర్పాటు చేయకుండా హైలెవల్ వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీపీ ముక్తి సత్యం కోరారు. వర్షాకాలం వాగులతో జలదిగ్బంధమై ఇబ్బందులు పడుతున్న నాగారం, కొడవటంచ, పాలగూడెం గ్రామస్తులతో కలసి సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కిన్నెరసాని, బండిరేవు వాగులపై హైలెవల్ వంతెనలు లేకపోవడంతో మూడు గ్రామాలు జలదిగ్బందం అవుతున్నాయని.. అత్యవసరాల్లో వాగులు దాటేందుకు ప్రయత్నిస్తున్న వారిని అడ్డుకునేందుకు వంతెనల వద్ద కంచెలు ఏర్పాటు చేసి కాపలా పెడుతున్నారే తప్పా శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్త చేశారు. వాగులు వచ్చే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని చెప్పే అధికారులు సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ఏడు మెలికల వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం, కాలువ పూర్తిగా ఇసుక మేటలు వేయడంతో నీళ్లుపారే పరిస్థితి లేదని దీంతో మూడు గ్రామాల చెరువులకు నీళ్ల అందడం లేదన్నారు. కొడవటంచ గ్రామంలో రేషన్ షాపు, హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని సమస్యల పరిష్కారం పోరాటాల ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. ధశలవారి ఉద్యమాలకు ప్రజలు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కోరం సీతారాములు, పర్శిక రవి, వజ్జ ఎర్రయ్య, ఈసం క్రిష్ణ, రమేష్, పై వెంకన్న, గడ్డం లాలయ్య, గోపయ్య లాలు తదితరులు పాల్గొన్నారు.